## ఈ వారం కథ

# నివేదన!

— శాకా శ్రీనివాసరావు

ఈ దేశపు ప్రియ న్యాయమూర్తుల్లారా...

మీ విలువైన కాలాన్ని కొద్ది నిముషాలు వృథాచేస్తున్నందుకు నన్ను ముందుగా మన్నించండి. ఈ పవిత్ర భారత దేశంలో నేనూ ఓ బలిపశువునైనందున నా వేదనను మీకు తెలియబరుస్తున్నాను. దయచేసి ఓపిక వహించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత మీ తీర్పునిస్తే ఆనందిస్తాను.

నా జననం ఎలా జరిగిందో తెలిపే జనం అంటూ నా కెవరూ లేరుగానీ అనాథ శరణాలయపు పసి జీవితం మాత్రం నాకింకా గుర్తుంది. పేరుకు తగినట్లుగానే అనాథలకు ఏం జరిగినా అడిగే దిక్కులేని శరణాలయంలో వార్డెన్లు మా చేత తమ బట్టలుతికించడం దగ్గర్నుంచి రకరకాలుగా వెట్టి చాకిరీ చేయించడం, అంతకుమించి పాచిపోయిన అన్నం అదీ చాలీ చాలకుండా పెట్టడం, తినకపోతే చేయవలసిన చాకిరీ రెట్టింపు చేయడంతో పాటు ముక్కుపచ్చలారని మాపై ముష్టిఘాతాలు ప్రయోగించడంవంటి అనేక సంఘటనలు ఇంకా నా మనసులో మెదులుతూనే ఉన్నాయ్.

అందరికీ బాల్యం వసంతంలా గడిస్తే నా జీవితంలో మాత్రం పదహారు వత్సరాలూ గ్రీష్మాలుగానే గడిచాయ్. ఆ తర్వాత సరైన పరువంతో నిండిన నా అందానికి ఆకర్షితుడైన ఓ వ్యక్తి నా శరీరంపై కలిగిన కామపు ప్రేరణే ప్రేమగా భ్రమించాడో అలా నన్ను నమ్మించాడో తెలియదుకానీ నాకు మానసికంగా ఎంతో దగ్గరయ్యాడు. అతని సాన్నిహిత్యంలో నా భావిజీవితం గొప్ప ఆనందమయపు కేళిలా అగుపించేది నాకు.

ఏకాంతంగా అతన్ని కలుసుకున్నప్పుడు పలుమార్లు నన్ను తన కోరిక తీర్చమంటూ బలవంతం చేసేవాడు. అయితే పెళ్ళికి ముందే అతనితో సాంగత్యానికి నేనొప్పుకోకపోవడంతో నా చదువు పూర్తయిన వెంటనే శరణాలయపు అధికారులతో మాట్లాడి పెళ్ళికి ముహూర్తం పెట్టించాడు. ఆ క్షణం అతడు నాకు ప్రత్యక్ష దైవంలా తోచాడు. అతని ఆదర్శానికి శరణాలయంలోని వార్డెన్లతో సహా పలువురు తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ నన్ను అదృష్టవంతురాలిగా కొనియాడటంతో ఒళ్ళు పుల్లమామిడి తిన్నట్లుగా పులకరించింది.

కానీ ఆ పెళ్ళి బలిపశువుకు చేసే అలంకరణ అనిగానీ... మా కాపురం గాలికి కూలిపోయే పేకమేడలాంటిదనిగానీ అప్పట్లో నాకర్థమయింది కాదు. సరిగ్గా పెళ్ళయిన నెల తర్వాత అనుకుంటా—

ఆ రోజు తన మిత్రుడింట్లో ఫంక్షనుందని త్వరగా తయారుకమ్మని చెప్పి నన్ను తనవెంట తీసుకెళ్ళి ఓ బ్రోతల్ హౌస్‌లో రేటు కుదుర్చుకుని వారికి నన్ను అప్పగించి తను వారిచ్చిన డబ్బు పుచ్చుకుని ఉడాయించాడు.

అంతవరకూ సంసారం పేరుతో 'భర్త' అనబడే ఓ మగాడితో నేను చేస్తున్నది పచ్చి వ్యభిచారమేనని మొట్టమొదటిసారిగా నా భర్త ద్వారా వ్యభిచరించబడిన నేను అప్పటిగానీ గ్రహించలేకపోయాను.

అప్పటినుంచీ రోజూ రాత్రిళ్ళు ఒక్కో కొత్త మృగాన్ని నా గదిలోకి వదిలి తలుపులు బిడాయించేవారు. ఆ మృగాలు తమ పశుబలాన్ని నాపై ప్రయోగించి తమ కసి తీరేవరకూ నాతో విచ్చలవిడిగా ఆటలాడుకుని బాల్యపు నరకాన్ని మించిన బాధను కలిగించేవారు. అప్పటినుంచీ చీకటి అంటేనే భయంకర 'దుస్వప్నం'గా మారిపోయింది నా జీవితంలో.

అలా కొద్దిరోజులు ప్రత్యక్ష నరకాన్ని అనుభవించాక —

వారికి నేను వ్యభిచారం చేయడానికి అలవాటుపడ్డట్టుగా నమ్మకం కుదిరిందో ఏమో కొద్దిగా స్వేచ్ఛను నాకు ప్రసాదించారు. ఆ కాస్త స్వేచ్ఛలోనే నా జీవితానికి పూర్తిస్వాతంత్ర్యాన్ని కోరుకునే ఉద్దేశంతో అక్కడి నుంచి ఎలాగో బయటపడగలిగాన్నేను.

అయితే అలా పులిబోనులోంచి బయటపడిన నేను నాగరీక సమాజమనే సింహపు కోరల మధ్య బందీనవుతానని, అది మరింత ప్రాణాంతకమనీ ఆ క్షణమే ఊహించి ఉంటే అప్పుడే ఆత్మాహుతి చేసుకునుండేదాన్నేమో?

తెగిన గాలిపటంలాగో రెక్కలు తెగినపక్షిలాగో ఎక్కడెక్కడో తిరిగి చివరకి ఓ మధ్య తరగతి ఇంట్లో పనిమనిషిగా చేరాను. మొదట్లో అక్కడ నన్నెవరూ పట్టించుకున్న పాపాన పోకపోయినా వారం రోజులు తిరిగేసరికి నా శుభ్రత మూలానో ఏమో ఇట్టే ఆకర్షించుకోగల నా అందానికీ, పట్టుసడలని నా పరువానికీ (ఆ రెండూ నావంటి ఒంటరి స్త్రీల పాలిట శాపాలని నాకు తెలిసింది కాదు) ఇంట్లోని మగవాళ్ళతో పాటూ ఆ వాడలోని మగవెధవలంతా నావైపు ఆకలిగొన్న పులుల్లా చూడటం గమనించాను నేను.

నే పనిజేస్తోన్న కుటుంబపు యజమాని ''నెరసిన జుట్టు వయసుకు చిహ్నంకానీ విజ్ఞానానికి కాదు''అన్న సూక్తికి అతికిపోయేలా ప్రవర్తించేవాడు. అతని ఇద్దరు కొడుకుల్లో పెద్దవాడైన పెదబాబు కళ్ళెప్పుడూ నా శరీరాన్ని రకరకాల కోణాల్లో శోధిస్తుండేవి.

పెళ్ళై సంవత్సరమైనా పెళ్ళాన్ని సుఖపెట్టడం చాతకాని పెదబాబు (ఆ విషయాన్ని గూర్చి అతని భార్య పలుమార్లు వ్యథచెందడం నాకు తెలుసు) నా పరిస్థితిపై కసాయి ప్రేమను ఒలకబోస్తుంటే అతనిపై అసహ్యమేసేది నాకు. ఒక్కోసారి అతని వెకిలి వేషాలెక్కువై తట్టుకోలేకపోయేదాన్ని.



అలాంటప్పుడు ముందు నీ పెళ్ళాన్ని సుఖపెట్టడం నేర్చుకోరా ఆడంగి వెధవా''అని అరవాలనిపించేది నాకు. కానీ ఆ విషయం బయటకు పొక్కినందుకు అతని భార్యను హింసిస్తాడేమోననే భయపు సందేహం నా నోరు నొక్కేసేది.

ఇక చినబాబు విషయానికొస్తే ఆయన పద్ధతి వేరు. బహుశా ఒక మనిషి వ్యక్తిత్వాన్నీ ప్రవర్తననూ ఆలోచనా విధానాన్ని పరిగణనలోకి తీసుకుని ఆ మనిషికి గౌరవాన్నీ విలువనూ వాటిని బట్టి ఇచ్చే అరుదైన వ్యక్తిత్వాన్నీ మొదటిసారిగా అతనిలోనే గమనించానేమో నేను.

ఎప్పుడూ కనిపించకపోయినా ఎన్నిసార్లు వేడుకున్నా ఏ విధంగానూ, ఆదుకొనకపోయినా ఆ భగవంతునిపై నాకెంతో గౌరవముందో అంతకుమించిన గౌరవం చినబాబుపై నాకు కలుగసాగింది. క్రమంగా ఆ గౌరవం అభిమానంగా మారి ఆయన నాపట్ల చూపుతున్న ఆదరానికి ఉక్కిరిబిక్కిరి అయ్యేదాన్ని నేను.

ఆ నేపథ్యంలో మా ఇద్దరికీ కొంతమంది ఓర్వలేని వాళ్ళ ద్వారా అక్రమ సంబంధం అంటకట్టబడినా అది మా అనుబంధంపై ఎలాంటి ప్రభావాన్ని చూపలేకపోయింది.

అదలా ఉంచితే—

ఏ రోజైనా పనిమీద వీధిలోకి వెళితే అడ్డమైన వెధవలూ (అంటే సంపాదనంతా జూదమాడటానికో, మద్యపానానికో, వ్యభిచారానికో తగలేసి తనపై ఆధారపడిన కుటుంబాన్ని ఆకలిపాలు చేస్తూ తిరిగే ప్రబుద్ధులూ... ఉద్యోగాల వేటలో అలసిపోయి నాలాంటి నిస్సహాయ స్త్రీల వెంటపడి వేధిస్తూ మానసిక ఆల్హాదాన్ని పొందే బాధ్యతల్లేని యువకులూ... ఇలా స్త్రీలను చిన్నచూపు చూసే మగవాళ్ళంతా) నా శరీరంలోని అంగాంగాలనూ నగ్నంగా దర్శించాలనే తపనతోనూ... వీళ్ళైతే తమ కామపు తమకాన్ని నన్ను చూస్తూ వివిధ భంగిమల్లో తమకు నచ్చిన రీతిలో ఊహించుకుంటూ (ఏ కంటికింపుగా కనిపించే స్త్రీను చూసినా ఇదే తంతు) తృప్తిచెందే ఈ సూడో మెంటాలిటీగాళ్ళంతా ''యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః'' అని ఘోషించే పురాణాలు కలిగిన భారతదేశంలోని పౌరులే కావడం ఈ దేశ దౌర్భాగ్యమేమో?!

శారీరక వ్యభిచారం కంటే మానసిక వ్యభిచారం మరింత నీచాతి నీచమైనదన్న నగ్నవాస్తవం అందరికీ తెలిసిందే అయినా శీలానికి సంబంధించి గొప్ప ఆచార సంప్రదాయలూ, వ్యవహారాలూ గల మన పవిత్ర భారత దేశంలోనే డేటింగ్‌లూ స్వేచ్ఛా వివాహాలూ అమలులో ఉన్న అమెరికా వంటి పాశ్చాత్య దేశాలలో కంటే మానసిక వ్యభిచారం అతి ఎక్కువ శాతం ఉన్నదంటే కారణం ఏమిటి? లోపమెక్కడుంది?

ప్రస్తుతం నా వయసు పాతికలోపే... అయినా ఇన్నీ సంవత్సరాల వయసులో ఓ సాధారణ సగటు ఆడపిల్ల తన జీవితంలో అనుభవించే ఏ చిన్న మధురానుభూతికీ నోచుకోలేకపోయిన నేను ఇకపైన అయినా అనుభవించగలనన్న ఆశ నాలో ఏకోశానా మిగలలేదు.

నేనూ మనిషినే. నాకూ మనసుంటుంది. కానీ దానికి ఎలాంటి స్పందనలూ కలుగని రీతిలో ఇంత చిన్న వయసులోనే నా బ్రతుకెందుకిలా బండబారిపోవాలి?

నే చదివిన చదువు నాలో విజ్ఞానాన్ని పెంచిందో లేదో తెలియదు కానీ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలోనూ... మనసులోని భావాలను బయటపెట్టుకోవడంలోనూ ఉపకారిగా ఉందన్నమాట వాస్తవం!

నిన్ననే నాకో క్రొత్త విషయం తెలిసింది...! అది— స్త్రీ జీవితానికి సంపూర్ణ అర్థాన్నిచ్చి సార్థకతను చేకూర్చే విషయం.

కానీ వసంతమాసంలో వినిపించే కోకిల కూత అయినా నాలాంటి విషమస్థితిలో ఇరుక్కున్న మనిషికి చేదుగానే వినిపిస్తుంది. అందుకే ఆ విషయం నన్ను మరింత మనోవ్యథకు గురిచేసిందేగానీ మాతృత్వపు మాధుర్యాన్ని చవిచూసే అవకాశం కలిగిందన్న ఆనందాన్ని ఏ కోశానా కలిగించలేదు.

నేనూ మిగతా తల్లుల్లాగే మధురూహలతో ఓ శిశువుకు జన్మనిచ్చినా... అందువల్ల నా జీవితం మరింత దుర్భరమయ్యే మాటెలా ఉన్నా నా బిడ్డకూడా బాల్యం నుంచే నేనెదుర్కొన్న సమస్యల వలయంలోనే చిక్కుపడుతుంది కానీ ఆ దశలో పొందే నైర్మల్యత నిండిన ఆనందాన్ని ఎలా పొందగలదు?

మిగతా స్త్రీలవలె సంసార జీవితం కొనసాగిస్తూ నా బిడ్డ భవిష్యత్‌ను తీర్చిదిద్దాలన్నా నన్నెవరూ ఇపుడు స్వీకరించలేరు. అంతకుమించి నా బిడ్డను తమ బిడ్డగా ఒప్పుకోలేరు. అంతటి మహోన్నత ఆదర్శంతో నన్నూ, నా బిడ్డనూ స్వీకరించినా ఆ వ్యక్తిని ఈ సంఘం మనశ్శాంతితో మనలనివ్వదు.

అలాంటి స్థితిలో— నా బిడ్డ తనకు మహోత్కృష్టమైన మానవ జన్మను ప్రసాదించినందుకు నన్ను పూజించడం మాని ద్వేషించడం మొదలుపెడుతుంది. ఈ ప్రపంచంలో ఏ కన్నతల్లి అలాంటి పరిస్థితిని తట్టుకోగలదు?!

కేవలం ఓ మగాడు చేసిన అన్యాయానికి ఇలాంటి విపరీత పరిస్థితుల్లో చిక్కుకోలేదు నేను. సాలెగూడులా సంఘం చుట్టూ అల్లుకుపోయిన అనైతిక విలువలు నన్నిలా దిగ్బంధించాయ్! అంతే! కనుక ఈ దేశపు న్యాయమూర్తుల్లారా...

పతనంలో పతకాస్థాయికి చేరుకున్న నైతిక విలువలను పునరుద్ధరించే ప్రయత్నంగా ఈ సభ్య సమాజానికి ఇండియన్ పీనల్ కోడ్‌లోని ఏ సెక్షన్‌ల ఆధారంగా ఎలాంటి శిక్షలు విధిస్తారో చెప్పండి?! లేదా—

వ్యసనాలంటే తెలియనీ... మంచి మన్ననలే ప్రాణంగా జీవించే మగవాళ్ళకు మాత్రమే ఈ సంఘంలో బ్రతికే అర్హత ఉన్నదంటూ వారికి సర్టిఫికెట్స్ (గుర్తింపు పత్రాల) ఇచ్చి మిగతా వారినందరినీ అండమాన్ జైళ్లకు పంపించేయండి.

లేకపోతే రక్తంలో అణువణునా దుర్గుణాలు పేరుకుపోయిన ఈ నాగరికులందరిలోనూ ఒక్కసారిగా కాకపోయినా క్రమంగానైనా మంచి మార్పు తేగల సత్తా మీ చట్టాలకుగానీ ప్రభుత్వ శాసనాలకుగానీ ఉందని మీరు వాదించగలరా?

అలా చట్టాలతోనూ శాసనాలతోనూ మార్పుతేగల సత్తా ప్రభుత్వానికి గానీ వాటి నమలుపరిచే అధికారులకుగానీ ఉంటే మహావృక్షమై పాతుకుపోయిన వరకట్నాన్ని ఎందుకు నిషేధించలేకపోతున్నారూ? వరకట్నపు చావులను ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?

నాకు జరిగిన అన్యాయాన్ని గొంతెత్తి ప్రశ్నించే హక్కైనా ఈ భరతభూమి కల్పించింది గనుక నా ఈ వేదనా భారాన్ని మీ ముందు నివేదిస్తున్నాను...!

మగాళ్ళవల్ల భంగపడిన నా జీవితాన్ని బాగుపరచుకోవడానికి నాకు తోచిన ఒకే ఒక ఆలోచన— తిరిగి ఆ మగవాళ్ళ బలహీనతలనే ఆధారంగా చేసుకుని కనీసం నా బిడ్డ భవిష్యత్‌నైనా గొప్పగా తీర్చిదిద్దాలని.

అందుకు ఏనాటి నుంచో నాపై కన్నేసిన మా ఊరి సర్పంచ్ ద్వారా మా నియోజకవర్గపు కాబోయే మంత్రిగారైన ఎమ్.ఎల్.ఎను నా కోణంలో చెప్పాలంటే నా స్త్రీత్వాన్ని ఎరగా వేసి లోబరచుకున్నాను. అది నాకు పెద్ద కష్టమైన పనికూడా కాలేదు. ఇప్పుడు నా చుట్టూ నాకు సేవలు చేసేందుకై కావలసినంత పరివారం!

నా ఈ ఆలోచన సరైంది కాకపోవచ్చు... ఎందుకంటే నేను మహాత్మాగాంధీకుగానీ, మహా మేధావి అంబేడ్కర్‌కు గానీ వారసురాలిని కాను గనుక!

చివరగా నేను మిమ్మల్ని కోరేదేమంటే—

ఏ పరిస్థితుల్లోనైనాసరే వ్యభిచార నేరంపై కోర్టుకొచ్చే స్త్రీలను వెంటనే యుద్ధ ప్రాతిపదికపై పునరావాస సౌకర్యాలు కలిగించేందుకు, అదే నేరంపై కోర్టుకొచ్చే మగవాళ్ళ మగతనాన్ని హరించే హక్కు కోర్టులకు ఐసీన్ 'ఇండియన్ లా'కు కలిగించేందుకూ ప్రభుత్వాన్ని వెంటనే శాసనం చేయవలసిందిగా నా ఈ కథ చదివాక ఈ దేశంలోని న్యాయవాదులూ, మీరూ సంఘటితమై ఒత్తిడి తేవాలని! నా ఈ కోరిక నేరవేరాలనే నా ఈ జీవిత చిత్రణ.

ఇక మీ నుంచి సెలవు కోరుకుంటున్నాను... ఎందుకంటే మంత్రిగారి సేవకు వేళయింది మరి...

ఇట్లు

అభాగ్యురాలినో అదృష్టవంతురాలినో ఎరుగకపోయి నా మగవాడి దౌష్ట్యానికి బలైన అబలగా మిగలకూడదని కాంక్షించే ఓ 'స్త్రీ'!

1/9/91